సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 4 । డిసెంబర్ । 2023

## నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..



• పాయల్ శంకర్

ఆదిలాబాద్: నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఓట్ల లెక్కింపు అనంతరం పాయల్ శంకర్ విజయం సాధించినట్లు ప్రకటించారు. దీంతో పార్టీ శ్రేణులు సంబరాలు షురూ చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది ప్రజల విజయమన్నారు. తాను మూడుసార్లు ఓడిపోయినప్పటికీ ఈ సారి పెద్ద మనసుతో ఆశీర్వదించారన్నారు. అనంతరం కార్యకర్తలు శంకర్‌ను భుజాలపై ఎత్తుకొని నినాదాలు చేస్తూ హోరెత్తించారు.

## మీ ఆశీర్వాదంతోనే.. ఈ గెలుపు



• అనిల్ జాదవ్

నేరడిగొండ: 'మీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుపొందా.. ఇక నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..' అని బోథ్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనిల్ జాదవ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ, మీరు నాపై ఉంచిన ఆశలను వమ్ముచేయనన్నారు. ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### ప్రశాంతంగా కౌంటింగ్

• ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, పరిశీలకులు



కౌంటింగ్ నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది

కైలాస్‌నగర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. రిటర్నింగ్ అధికారులు స్రవంతి, చాహత్ బాజ్‌పాయ్ ఆద్యంతం కేంద్రంలో ఉండి పర్యవేక్షించారు. బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న 14వ రౌండ్ తర్వాత వెనుదిరిగారు. బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ కేంద్రానికి వచ్చినప్పటికి కౌంటింగ్ హాల్‌లో కూర్చోకుండా బయటే గడిపారు. కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి కేంద్రానికే రాలేదు. బోథ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అడే గజేందర్, బీజేపీ సోయం బాపూరావులు ఉదయమే కేంద్రానికి వచ్చారు. సోయం బాపూరావు తొలిరౌండ్ అనంతరం వెనుదిరుగగా, ఆడె గజేందర్ మధ్యలో వెళ్లిపోయారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ చివరి రౌండ్‌లో కేంద్రానికి హాజరయ్యారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు నితిన్ కే పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి కమాండ్ కంట్రోల్ రూం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పరిశీలించారు.

### పటిష్ట బందోబస్తు

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని టీటీడీసీ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కేఆర్‌కే కాలనీవైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. కౌంటింగ్ కేంద్రం సమీపంలో 144 సెక్షన్ అమలు చేశారు. 365 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఐదు చెక్ పోస్టులు, నాలుగు పెట్రోలింగ్ పార్టీలతో మూడంచెల భద్రత చేపట్టారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డితో పాటు డీఎస్పీలు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండి భద్రతను పర్యవేక్షించారు. బీజేపీ నాయకులు సంబరాలు చేసుకోవడంతో వారిని అక్కడి నుంచి బయటకు పంపించారు. ప్రశాంతంగా ప్రక్రియ ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

### ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో కంది శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అఖండ విజయం సాధించడంతో పార్టీ శ్రేణులు ఆదివారం జిల్లా కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రజాసేవా భవన్ నుంచి నాయకులు జెండాలు పట్టుకొని ఎన్టీఆర్‌చౌక్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నృత్యాలతో సందడి చేశారు. టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. ఇందులో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు విజయం

• నాలుగో ప్రయత్నంలో సక్సెస్
• ఆదిలాబాద్‌లో పాయల్ శంకర్, బోథ్‌లో అనిల్ జాదవ్ గెలుపు
• వరుస అపజయాల తర్వాత విజయబావుటా
• ఇటు బోణీ కొట్టిన బీజేపీ.. అటు మరోసారి బీఆర్ఎస్ విన్
• రెండు చోట్ల ప్రతిపక్ష హోదానే..
• ప్రభావం చూపని కాంగ్రెస్ అభ్యర్థులు

| ఆదిలాబాద్ |
|---|
| పాయల్ శంకర్ (బీజేపీ) ఓట్లు 67,608, మెజార్టీ 6,692 |
| జోగు రామన్న (బీఆర్ఎస్) ఓట్లు 60,916 |
| కంది శ్రీనివాస్‌రెడ్డి (కాంగ్రెస్) ఓట్లు 47,724 |

| బోథ్ |
|---|
| అనిల్ జాదవ్ (బీఆర్ఎస్) ఓట్లు 76,792, మెజార్టీ 22,800 |
| సోయం బాపురావు (బీజేపీ) 53,992 |
| అడె గజేందర్ (కాంగ్రెస్) ఓట్లు 32,797 |

విజయోత్సవం: పాయల్ శంకర్‌ను భుజాలపై ఎత్తుకెళ్తున్న పార్టీ శ్రేణులు



అనిల్‌జాదవ్ ఇంటి వద్ద మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు



సాక్షి,ఆదిలాబాద్: నాలుగో ప్రయత్నం ఆ ఇద్దరి నేతలకు ఒకేసారి కలిసివచ్చింది. ఆదిలాబాద్‌లో పాయల్ శంకర్, బోథ్‌లో అనిల్ జాదవ్‌లు ఇది వరకు మూడుసార్లు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ అదృష్టం కలిసిరాలేదు. అపజయాల తర్వాత విజయబావుటా ఎగురవేశారు. ఆదివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో ఈ ఇద్దరు గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి సారి ఆదిలాబాద్‌లో బీజేపీ బోణీ కొట్టింది. బోథ్‌లో బీఆర్ఎస్ విజయ దుందుభి కొనసాగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, జిల్లాలో మాత్రం ఈ రెండు స్థానాల్లో ప్రతిపక్ష హోదా లభించింది.

**ఉత్కంఠకు తెర..**

ఎన్నికల ఫలితాలపై అందరి దృష్టి నెలకొని ఉండగా, ఆ ఉత్కంఠకు తెరపడింది. జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో ఆదివారం కౌంటింగ్ నిర్వహించారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి నవంబర్ 30న పోలింగ్ తర్వాత ఈవీఎంలను ఇక్కడే భద్రపర్చారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, రిటర్నింగ్ అధికారులు ఆర్డీవో స్రవంతి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లను లెక్కించారు. ఆ తర్వాత ఈవీఎం ఓట్లను కౌంట్ చేశారు. ఆదిలాబాద్ ఓట్లకు సంబంధించి 21 రౌండ్లు, బోథ్‌కు సంబంధించి 22 రౌండ్‌లలో లెక్కింపు పూర్తయింది. ఆ తర్వాత గెలుపొందిన అభ్యర్థులు పాయల్ శంకర్(బీజేపీ), అనిల్ జాదవ్ (బీఆర్ఎస్)కు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

**మెజార్టీ రౌండ్‌లలో ఆధిక్యం..**

ఆదిలాబాద్‌లో పాయల్ శంకర్ 15 రౌండ్‌లలో ఆధిక్యం కనబర్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న ఐదు రౌండ్‌లలో, కాంగ్రెస్ అభ్యర్థి ఒకే ఒక రౌండ్‌లో ఆధిక్యం చూపారు. రెండో రౌండ్‌లో జోగు రామన్నకు పాయల్ శంకర్‌ను మించి 59 ఓట్ల స్వల్ప ఆధిక్యం వచ్చినప్పటికీ ఆ తర్వాత ప్రతీరౌండ్‌లో బీజేపీ ఆధిక్యత కొనసాగింది. బోథ్‌లో అనిల్ జాదవ్ ఏకంగా 20 రౌండ్‌లలో ఆధిక్యం కొనసాగింది. బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు కేవలం రెండు రౌండ్‌లలో ఆధిక్యం కనబరచగా.. మొత్తం లీడ్ పరంగా అనిల్‌జాదవ్‌ను ఏ రౌండ్‌లోనూ దాటలేకపోయారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి కనీసం ఒక్క రౌండ్‌లోనూ ఆధిక్యం కనబర్చలేదు.

**ఆ యోధులకు తప్పని ఓటమి**

జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న ఆ ఇద్దరు నేతలకు శాసనసభ ఎన్నికల్లో ఓటమి తప్పలేదు. ఆదిలాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన జోగు రామన్నకు ఈ ఎన్నికలు కలిసిరాలేదు. 2009 నుంచి ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. 14 ఏళ్ల తర్వాత ఆయనకు ప్రజాప్రతినిధి హోదా దక్కలేదు. ఆరోసారి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన 2004లో ఒక సారి ఓడిపోయారు. అప్పుడు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. బోథ్ బీజేపీ అభ్యర్థిగా సోయం బాపూరావుకు కూడా ఈ ఎన్నికల్లో పరాభవం తప్పలేదు. 2004లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత 2014లో టీడీపీ నుంచి, 2018లో కాంగ్రెస్ నుంచి ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసినా గెలుపు దక్కలేదు. 2019లో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందారు.

**ప్రభావం చూపని కాంగ్రెస్ అభ్యర్థులు..**

ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు కంది శ్రీనివాసరెడ్డి, అడె గజేందర్ మూడో స్థానానికి పరిమితం అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ కొనసాగినా ఈ ఇద్దరు పెద్దగా ప్రభావం చూపలేదు.

## ఆదిలాబాద్‌లో వికసించిన 'కమలం'

• పాయల్ శంకర్ విజయం
• పోస్టల్ బ్యాలెట్ సహా 15 రౌండ్లలో ఆధిక్యం
• 14వ రౌండ్‌లో వెనుదిరిగిన జోగు రామన్న



ఎమ్మెల్యేగా ఎన్నికైన ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో తొలిసారిగా కమలం వికసించింది. బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మూడు పర్యాయాలు జోగు రామన్న చేతిలో పరాజయం పాలైన శంకర్ నాలుగోసారి తన విజయాన్ని ఖాయం చేసుకున్నారు. ఆదివారం వెల్లడించిన అసెంబ్లీ ఫలితాల్లో 6,692 ఓట్ల ఆధిక్యంతో విజయబావుటా ఎగురవేశారు. 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగ్గా 16రౌండ్లలో ఆయన ఆధిక్యత ప్రదర్శించారు. 66,468ఓట్లుసాధించగా, పోస్టల్ బ్యాలెట్‌లో కూడా 1,140 ఓట్లను పొందారు. ఉద్యోగులు సైతం ఆయనకు జై కోట్టారు. మొత్తం ఆయనకు 67,608 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్నకు 60,321 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు ఆయనకు మద్దతుగా నిలువ లేదు. కేవలం 595 ఓట్లతో మూడోస్థానంలోనిలిచారు.మొత్తం 60,916 ఓట్లతో రెండో స్థానానికే పరిమితయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి 21 రౌండ్లలో 46,763 ఓట్లురాగా పోస్టల్ బ్యాలెట్‌లో 961 ఓట్లు వచ్చాయి. దీంతో పాటు ఆయన నాలుగో రౌండ్‌లో పాయల్ శంకర్‌పై 704 ఓట్ల ఆధిక్యత ప్రదర్శించారు. మిగతా రౌండ్లలో మూడో స్థానానికే పరిమితమై ఓటమి పాలయ్యారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న 14వ రౌండ్‌లో 984 ఓట్ల ఆధిక్యత, 16వ రౌండ్‌లో 1180 ఓట్లు, 17వ రౌండ్‌లో 669 ఓట్లు , 21 వ రౌండ్‌లో 273 ఓట్లతో ఆధిక్యత కనబర్చారు. కాగా 14వ రౌండ్‌లోనే జోగు రామన్న కౌంటింగ్ కేంద్రం నుంచి వెళ్లిపోయారు.

| రౌండ్ల వారీగా వివరాలు.... | | | | గెలిచిన అభ్యర్థి ఆధిక్యం |
|---|---|---|---|---|
| రౌండ్ | బీజేపీ | బీఆర్ఎస్ | కాంగ్రెస్ | |
| 1 | 2,828 | 2,456 | 1,735 | 372 |
| 2 | 3,222 | 3,653 | 2,415 | 431 |
| 3 | 3,426 | 2,413 | 2,230 | 1,013 |
| 4 | 2,536 | 2,786 | 2,951 | – |
| 5 | 3,677 | 3,521 | 2,655 | 156 |
| 6 | 2,683 | 2,504 | 2,198 | 179 |
| 7 | 2,975 | 2,273 | 2,399 | 576 |
| 8 | 3,479 | 2,081 | 1,779 | 1,398 |
| 9 | 3,760 | 2,527 | 1,919 | 1,233 |
| 10 | 3,027 | 2,337 | 2,662 | 690 |
| 11 | 3,889 | 2,992 | 2,599 | 897 |
| 12 | 2,821 | 2,548 | 2,558 | 273 |
| 13 | 2,560 | 2,317 | 2,089 | 243 |
| 14 | 2,857 | 3,841 | 2,857 | – |
| 15 | 3,659 | 3,209 | 2,113 | 450 |
| 16 | 2,498 | 3,678 | 2,475 | – |
| 17 | 2,937 | 3,606 | 2,417 | – |
| 18 | 3,792 | 3,509 | 1,642 | 283 |
| 19 | 3,784 | 2,187 | 2,187 | 1,597 |
| 20 | 3,805 | 3,357 | 1,933 | 448 |
| 21 | 2,253 | 2,526 | 1,261 | – |
| పోస్టల్ బ్యాలెట్ | 1,140 | 595 | 961 | 179 |
| మొత్తం | 67,608 | 60916 | 47724 | 6692 |

## బోథ్‌లో 'గులాబీ' గుబాళింపు

• ఎమ్మెల్యేగా అనిల్‌జాదవ్ గెలుపు
• 23,023 ఓట్ల మెజార్టీ
• మొదటి రౌండ్ నుంచే ఆధిక్యత



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అనిల్ జాదవ్

ఇచ్చోడ: ఎస్టీ రిజర్వ్‌డైన బోథ్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్ ఘన విజయం సాధించారు. సమీప బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుపై 23,023 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 22 రౌండ్లకు గాను 15,19 మినహా అన్ని రౌండ్లలో ఆధిక్యం సాధించారు. అనిల్‌జాదవ్‌కు 76,297 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుకు 53,274 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్‌కు 32,426 ఓట్లు పోలయ్యాయి. అనిల్ జాదవ్ గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్‌బాజ్‌పాయ్ ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

| రౌండ్ల వారీగా వివరాలు... | | | | గెలిచిన అభ్యర్థి ఆధిక్యం |
|---|---|---|---|---|
| రౌండ్ | బీఆర్ఎస్ | కాంగ్రెస్ | బీజేపీ | |
| 1 | 3,445 | 2,235 | 2,061 | 1,210 |
| 2 | 3,340 | 2,165 | 2,003 | 1,175 |
| 3 | 4,228 | 2,927 | 1,980 | 1,301 |
| 4 | 3,353 | 2,336 | 1,777 | 1,017 |
| 5 | 3,246 | 2,380 | 1,370 | 866 |
| 6 | 2,682 | 1,466 | 2,282 | 400 |
| 7 | 3,488 | 1,331 | 3,083 | 405 |
| 8 | 4,410 | 861 | 2,721 | 2,139 |
| 9 | 3247 | 652 | 3,177 | 70 |
| 10 | 3,730 | 1,148 | 2,337 | 1,393 |
| 11 | 4,192 | 1,476 | 2,873 | 1,319 |
| 12 | 4,530 | 1,028 | 3,281 | 1,249 |
| 13 | 3,078 | 891 | 2,694 | 384 |
| 14 | 3,555 | 1,086 | 2,482 | 773 |
| 15 | 1,955 | 475 | 2,304 | -- |
| 16 | 3,510 | 1,802 | 2,799 | 711 |
| 17 | 3,520 | 1,226 | 2,768 | 752 |
| 18 | 3,183 | 1,626 | 2,176 | 1,007 |
| 19 | 3,662 | 1,456 | 3,697 | -- |
| 20 | 3,378 | 1,983 | 2,017 | 1,361 |
| 21 | 4,195 | 1,655 | 1,765 | 2,430 |
| 22 | 2,670 | 221 | 1,627 | 1,043 |

## మురిసిన ఆదివాసీ పల్లెలు..

• హోరాహోరీ పోరులో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు జయకేతనం
• మొదటి నుంచి చివరి వరకు దాదాపు అన్నిరౌండ్లలో ఆధిక్యత
• బీఆర్ఎస్ రెండో స్థానం, బీజేపీకి థర్డ్
• త్రిముఖపోరులో మూడు ప్రధానపార్టీల అభ్యర్థులకు 50వేల పైచిలుకు ఓట్లు

ఖానాపూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మూడు ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాల్లో ఒకటైన ఖానాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో చివరకు గిరిజన తెగలోని ఆదివాసీ గోండ్ సామాజిక వర్గానికి చెందిన వెడ్మ బొజ్జు పటేల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల పరిధిలో ఉండే ఖానాపూర్ నియోజకవర్గంలోని ఓట్లను అధికారులు 22 రౌండ్లలో లెక్కించారు. మొదటి నుంచి చివరి వరకు సుమారుగా అన్ని రౌండ్లలోనూ అభ్యర్థులు వెయ్యి, రెండు వేల ఓట్లతో ఆధిక్యత కనబర్చడంతో ఉత్కంఠగా మారింది.

**ముగ్గురికి 50వేలకు పైగా ఓట్లు**

మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు 50 వేల పైచిలుకు ఓట్లు పొందారు. కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు 58,210 ఓట్లతో విజయం సాధించగా బీఆర్ఎస్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్ 53,921 ఓట్లతో రెండో స్థానంలో, బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్ 51,518 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. వెడ్మ బొజ్జు 4,289 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.





ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బొజ్జు

**30 ఏళ్ల తర్వాత ..**

సుమారు 30 ఏళ్లక్రితం ఆదివాసీ సామాజికవర్గం నుంచి దివంగత నేత కోట్నాక భీంరావు గెలుపొందారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రతీసారి లంబాడా సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. ఈ క్రమంలో 30 ఏళ్ల తర్వాత తిరిగి ఆదివాసీలంతా ఏకతాటిపైకి వచ్చి ఆదివాసీ అభ్యర్థి గెలుపులో భాగస్వాములయ్యారు. నిరుపేదకు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి, గెలిపించిన నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులకు బొజ్జు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# తూర్పున కాంగ్రెస్, పశ్చిమాన కమలం

• మధ్య ప్రాంతంలో బీఆర్ఎస్ గెలుపు
• పోటీలో ఉన్న ఎమ్మెల్యేలంతా ఓటమే
• గెలిచిన వారిలో కొత్తవారే అధికం
• ఉమ్మడి జిల్లా ఎన్నికల ఫలితాల్లో వైవిధ్యం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటర్లు విభిన్న తీర్పుతో ఈ ఎన్నికల్లో తమ వైవిధ్యాన్ని చాటారు. తూర్పున కాంగ్రెస్ హవా కొనసాగగా, పశ్చిమ జిల్లాలో కమలం వికసించింది. మధ్యలో కారు ప్రయాణం సాగింది. మొత్తంగా ఈ ఎన్నికల్లో పది అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ వైపు ఎక్కువ మొగ్గు చూపకుండా ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలకు సమన్యాయం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎన్నికల చరిత్రలో బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. 2019 ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా సోయం బాపురావు గెలిచారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పెద్దగా ప్రభావం చూపలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా నాలుగు స్థానాల్లో బీజేపీ పాగా వేయడం గమనార్హం.

**కలిసొచ్చిన ముక్కోణ పోటీ..**

నిర్మల్, ఆదిలాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ముక్కోణ పోటీ నెలకొంది. నిర్మల్‌లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి (బీజేపీ), అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి(బీఆర్ఎస్), కూచాడి శ్రీహరిరావు(కాంగ్రెస్) మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు సమంగా ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ వ్యతిరేక ఓట్లు చీలిపోయాయి. చివరికి బీజేపీ బయటపడింది. సిర్పూర్‌లో బీఎస్పీ చీఫ్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ బరిలో ఉండడంతో ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీతోపాటు బీఎస్పీ ఓట్లు పంచుకున్నాయి. ముథోల్‌లో బీఆర్ఎస్‌కు మైనార్టీ ఓట్లు కలిసి రాగా, ఇక్కడ కాంగ్రెస్ ఆశించిన ఓట్లు రాబట్టలేకపోవడంతో మిగతా వర్గం ఓట్లు బీజేపీ వైపు మళ్లాయి. ఆదిలాబాద్‌లోనూ బీజేపీ, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. 6వేల మెజార్టీతో బయటపడ్డారు. ఇక్కడ కూడా కాంగ్రెస్ మూడో స్థానంలో నిలిచింది. మొదట బోథ్ స్థానంలోనూ బీజేపీ గట్టిపోటీ ఇచ్చింది. ఇక్కడ బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నిలిచింది. ఎంపీ సోయం బాపురావు బరిలో ఉండడంతో ఆ పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. చివరకు బీఆర్ఎస్ 22వేల మెజార్టీ సాధించింది.





**ఎస్టీ స్థానాల్లో బీఆర్ఎస్**

పది స్థానాల్లో ఎనిమిది చోట్ల చతికిల పడ్డ బీఆర్ఎస్ మూడు ఎస్టీ స్థానాల్లో బోథ్, ఆసిఫాబాద్ బీఆర్ఎస్ గెలిచి పరువు నిలబెట్టుకుంది. గత ఎన్నికల్లో ఆసిఫాబాద్‌లో స్వల్ప తేడాతో ఓడిపోయిన కోవ లక్ష్మి, సిట్టింగ్ ఎమ్మెల్యే బాపురావు కాదని అనిల్ జాదవ్‌కు అవకాశం ఇస్తే, గెలిచారు. ఈ మూడు స్థానాల్లో ఖానాపూర్ మాత్రం కాంగ్రెస్ గెలుచుకుంది. గత ఎన్నికల్లో తొమ్మిది స్థానాలు అప్పటి టీఆర్ఎస్‌కు రాగా ఆసిఫాబాద్ ఎస్టీ స్థానం మాత్రమే కాంగ్రెస్‌కు వచ్చింది. ఇక్కడ ఈసారి బీఆర్ఎస్ గెలుచుకుంది.

**అసెంబ్లీకి కొత్త ముఖాలు**

రెండో ప్రయత్నంలో రామారావు పాటిల్ గెలిచి తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. సిర్పూర్ నుంచి పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్ నుంచి పాయల్ శంకర్, బోథ్ నుంచి అనిల్ జాదవ్, ఖానాపూర్ నుంచి వెడ్మ బొజ్జు, మంచిర్యాల నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, మాజీ ఎంపీ వివేక్ తొలిసారిగా శాసనసభకు ఎన్నికయ్యారు. మాజీ మంత్రి వినోద్, కోవ లక్ష్మి, ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలో ఎమ్మెల్యేలుగా గెలిచారు.

**సిట్టింగ్‌ల ఓటమి**

సిట్టింగ్ ఎమ్మెల్యేలైనా పది మంది ఓటమి పాలయ్యారు. నిర్మల్‌లో సీనియర్ నాయకులు, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, నాలుగు సార్లు గెలిచిన మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, ముథోల్‌లో విఠల్ రెడ్డి, సిర్పూర్‌లో కోనేరు కోనప్ప, బెల్లంపల్లి చిన్నయ్య, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఘోర ఓటమి చవి చూశారు. ఈ ఎన్నికల్లో ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపురావు, ఆత్రం సక్కుకు బీఆర్ఎస్ నుంచి టికెట్లు రాకపోవడంతో పోటీకి దూరంగా ఉన్నారు.

## క్లుప్తంగా

### ఒక్కటిగా నడిచి.. ఒకేపార్టీలో గెలిచి..



కౌంటింగ్ కేంద్రం వద్ద మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్

నిర్మల్: నిర్మల్, ముధోల్ బీజేపీ అభ్యర్థులుగా గెలుపొందిన మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్ ఇద్దరూ కొన్నేళ్లగా కలిసి రాజకీయ ప్రయాణం చేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఏలేటి ఏఐసీసీ పోస్టులోకి వెళ్లగా, రామారావుపటేల్‌ను డీసీసీ అధ్యక్షుడిని చేశారు. గత ఎన్నికల్లో ఇద్దరూ కాంగ్రెస్ నుంచి పోటీచేసి ఓడిపోయారు. సరిగ్గా ఏడాది క్రితం రామారావుపటేల్ బీజేపీలో చేరగా, ఏడెనిమిది నెలల కిందట ఏలేటి కమలం గూటికి వచ్చారు. ముధోల్ టికెట్ కోసం తీవ్ర పోటీ ఉండగా, పటేల్‌కు టికెట్ రావడానికి ఏలేటి సహకరించారు. ఇద్దరూ.. ఈసారి ఎన్నికల్లో తమ ప్రత్యర్థులను మట్టికరిపించి, కలిసే అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

### కోతుల పునరావాస కేంద్రం సందర్శన



వివరాలు వెల్లడిస్తున్న అటవీశాఖ అధికారులు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని కోతుల పునరావాస కేంద్రాన్ని, గండిరామన్న హరితవనాన్ని ట్రైనీ ఐఎఫ్‌ఎస్(ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్) అధికారులు ఆదివారం సందర్శించారు. కేంద్రంలో అక్కడ కోతులకు నిర్వహించే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వాటిని నిర్వహించే విధానం, ఆపరేషన్లు నిర్వహించిన అనంతరం కోతుల ఆరోగ్యం కోసం తీసుకునే జాగ్రత్తలు తదితర విషయాలను గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గండిరామన్న హరితవనం సందర్శించి సందర్శకులకోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, వాచ్‌టవర్, గ్రీనరీ, అడవి జంతువుల విగ్రహాలను పరిశీలించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ కోర్సు డైరెక్టర్ గంగారెడ్డి, డీఎఫ్‌వో రాంకిషన్‌యాదవ్, ఎఫ్‌ఆర్‌వో జైపాల్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌వో వేణుగోపాల్, పార్క్ మేనేజర్ అస్రార్, దూలపల్లి ఎఫ్‌ఎస్‌వో శిక్షణ అభ్యర్థులు ఉన్నారు.

### ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయించిన ముగ్గురిపై వన్‌టౌన్, టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని తిర్పెల్లి ఏరియాలో తోట అశోక్ పాన్‌షాపులో మద్యం విక్రయించగా రూ.2574 విలువ గల 15బాటిళ్లను, కల్పన బార్ వద్ద మద్యం విక్రయిస్తున్న గర్క హన్మాండ్లు, అశోక్‌రెడ్డిల నుంచి రూ.2500 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సైలు కలీం, అశోక్ కుమార్ తెలిపారు.

### వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపు..

నిర్మల్ : జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌లో ఈవీఎంలు మొరాయించాయి. ముధోల్ నియోజకవర్గానికి సంబంధించిన మూడు ఈవీఎంలు, నిర్మల్ నియోజకవర్గానికి చెందిన రెండు ఈవీఎంలు కౌటింగ్ సందర్భంగా ఆన్ కాలేదు. దీంతో అధికారులు కొంతసేపు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో అధికారులు వీవీ ప్యాట్లలోని స్లిప్పులను లెక్కించారు.



# నోటాకు ఓటేశారు..!

- ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 17327
- బోథ్ నియోజకవర్గంలో అత్యధికం




కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నోటాకు ఓటేసిన వారి సంఖ్య ఈ ఎన్నికల్లో కాస్త తగ్గింది. చట్టసభలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమైనది. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటింది. కానీ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో అభ్యర్థులందరూ అందరికీ ఆమోదయోగ్యులై ఉండాలని ఏమీ లేదు. గతంలో నచ్చని అభ్యర్థులు బరిలో ఉన్న చోట్ల ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేయడం, మరికొందరు ఓటింగ్‌కు దూరంగా ఉండడం జరిగేది. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈవీఎం బ్యాలెట్లలో నోటా(నన్ ఆఫ్ ద ఎబోవ్) బటన్ తీసుకొచ్చారు. ఇది కేవలం ఓటరుకు ఐచ్ఛికం మాత్రమే. అభ్యర్థులు ఎవరూ సరైన వారు లేరని భావించిన పక్షంలో నోటాకు ఓటు వేయవచ్చు. అత్యధికంగా నోటాను వినియోగించుకున్నా పోలైన ఓట్లలో మెజార్టీ ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. 2014అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 17,095 మంది ఓటర్లు నోటా బటన్ నొక్కారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 20,254 ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 17,327 మంది నోటాకు ఓటేశారు. బోథ్ నియోజకవర్గంలో అత్యధికంగా నోటాకు వేశారు.

**ఇలా ఈవీఎంల్లోకి..**

2013లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా నోటాను ప్రవేశపెట్టారు. దీన్ని భావ వ్యక్తీకరణలో అంతర్భాగంగానే పరిగణించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. తొలిసారిగా ఢిల్లీ, మిజోరాం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 2013 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో నోటా ఐచ్ఛికాన్ని ప్రవేశపెట్టారు. అన్ని గుర్తులకంటే చివరలో నోటా గుర్తు ఉంటుంది. ఈ గుర్తును అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సంస్థ రూపొందించింది.

**ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు**

| నియోజకవర్గం | 2014 | 2018 | 2023 |
|---|---|---|---|
| సిర్పూర్ | 1752 | 1579 | 2196 |
| చెన్నూర్ | 1609 | 2135 | 1792 |
| బెల్లంపల్లి | 769 | 2598 | 2179 |
| మంచిర్యాల | 1472 | 1394 | 942 |
| ఆసిఫాబాద్ | 2829 | 2715 | 1515 |
| ఖానాపూర్ | 2421 | 2776 | 2114 |
| ఆదిలాబాద్ | 850 | 1149 | 592 |
| బోథ్ | 2242 | 2275 | 2565 |
| నిర్మల్ | 1360 | 1367 | 1526 |
| ముధోల్ | 1791 | 2266 | 1906 |

**స్వతంత్రుల కన్నా ఎక్కువ**

బోథ్: బోథ్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు సాధించిన ఓట్ల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. నోటాకు 2565 మంది నోటాను వినియోగించుకున్నారు. బీఎస్పీ అభ్యర్థి జంగుబాపుకు 2044 ఓట్లు, బీసీపీ పార్టీ అభ్యర్థి ఆడె సునీల్ నాయక్‌కు 677, ఆర్‌జేపీ అభ్యర్థి హీరాజీకి 1388, డీఎస్పీ అభ్యర్థి ఉమేష్‌కు 1011, జీజీపీ అభ్యర్థి బాదు నైతంకు 596, స్వతంత్ర అభ్యర్థులు భోజ్యా నాయక్‌కు 878, ధనలక్ష్మికి 1231 ఓట్లు పోల్ అయ్యాయి.

**బోథ్ నియోజకవర్గంలో అభ్యర్థులకు పోలైన ఓట్లు..**

ఇచ్చోడ: బోథ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఆదివారం ఓట్ల లెక్కింపులో పార్టీల వారీగా వచ్చిన ఓట్లు

| అభ్యర్థి పేరు | పార్టీ పేరు | పోలైన ఓట్లు |
|---|---|---|
| అనిల్ జాదవ్ | బీఆర్‌ఎస్ | 76297 |
| సోయం బాపూరావు | బీజేపీ | 53274 |
| ఆడె గజేందర్ | కాంగ్రెస్ | 32426 |
| మేస్రం జంగుబాపు | బీఎస్పీ | 2044 |
| ఆడె సునీల్ కుమార్ | బీసీవై పార్టీ | 677 |
| ఉయిక హీరాజీ | ఆర్‌ఏజేపీపీ | 1388 |
| ఉయికే ఉమేష్ | డీఎస్పీ | 1011 |
| బాదు నైతం | జీజీపీ | 596 |
| జాదవ్ బోజ్యానాయక్ | స్వతంత్ర | 878 |
| తొడసం ధనలక్ష్మి | స్వతంత్ర | 1231 |



# ఓడిన రాజకీయ ఉద్ధండులు..

- అల్లోల, విఠల్‌రెడ్డి, రాథోడ్‌లకు పరాభవం
- రాజకీయ జీవితానికి పెద్దదెబ్బ



అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్‌ఎస్, నిర్మల్



గడ్డిగారి విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్, ముధోల్



రమేశ్‌రాథోడ్, బీజేపీ, ఖానాపూర్

నిర్మల్: అసెంబ్లీ ఎన్నికలు జిల్లాలోని రాజకీయ ఉద్ధండులకు పీడకలగా మిగలనున్నాయి. తమ రాజకీయ జీవితానికే కఠిన పరీక్ష పెట్టేలా ఫలితాలను ఇచ్చాయి. నిర్మల్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన సీనియర్‌నేత, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి, ఖానాపూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్ ఈ ముగ్గురూ ఓటమిని మూటగట్టుకున్నారు. మంత్రిగా ఉన్న అల్లోల, ఎమ్మెల్యేగా ఉన్న విఠల్‌రెడ్డిలు బీజేపీ అభ్యర్థులు మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్ చేతుల్లో భారీ తేడాతో ఓడిపోగా, రమేశ్‌రాథోడ్ కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి తొలిసారి పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు చేతిలో ఓడిపోయారు. అల్లోల, రమేశ్‌రాథోడ్ ఇవే తమకు చివరి ఎన్నికలన్నట్లుగా ప్రజల్లోకి వెళ్లినా పరాజ యం తప్పలేదు. ఓట మిని ముందే పసిగట్టిన ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రానికే రాకపోవడం గమనార్హం.

**నిర్మల్ మరోసారి వినూత్నం..**

నిర్మల్: రాజకీయ చైతన్యమున్న నిర్మల్ నియోజకవర్గ ప్రజలు విలక్షణ తీర్పు ఇస్తున్నారు. స్వాతంత్ర్య వచ్చిన తర్వాత దేశమంతా కాంగ్రెస్ హవా నడువగా.. అప్పుడు 1952లో నిర్వహించిన తొలి ఎన్నికల్లో ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న నిర్మల్‌లో సోషలిస్టు పార్టీ అభ్యర్థులు గోపిడి గంగారెడ్డి, గంగారాం గెలుపొందారు. 2009లో కొత్త పార్టీ ప్రజారాజ్యం నుంచి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, 2014లో బీఎస్పీ నుంచి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపొందారు. ఈ రెండు ఎన్నికల్లోనూ రాష్ట్రంలో ఇతర పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈసారి బీజేపీ బంపర్ మెజార్టీతో గెలువగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

### కాంగ్రెస్‌ది వింత పరిస్థితి..



కూచాడి శ్రీహరిరావు, కాంగ్రెస్, నిర్మల్



నారాయణరావుపటేల్, కాంగ్రెస్, ముధోల్

నిర్మల్: రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్‌కు జిల్లాలో వింత పరిస్థితి ఎదురైంది. ఇక్కడ ఖానాపూర్ స్థానాన్ని దక్కించుకోగా, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో ఓటమిని మూటగట్టుకుంది. నిర్మల్‌లో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు కు 28,642ఓట్లు రాగా, ముధోల్‌లో నారాయణరావుపటేల్‌కు 15,489ఓట్లు వచ్చాయి. వీరిద్దరూ డిపాజిట్లు కోల్పోయి మూడోస్థానానికి పరిమితమయ్యారు.

### గెలిచిన బొజ్జు.. ఓడిన జాన్సన్..



వెడ్మ బొజ్జుపటేల్, కాంగ్రెస్, ఖానాపూర్



జాన్సన్‌నాయక్, బీఆర్‌ఎస్, ఖానాపూర్

నిర్మల్: ఖానాపూర్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి నమ్మకస్తుడు గెలువగా, కేటీఆర్ దోస్తు ఓడిపోయారు. కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన వెడ్మ బొజ్జుకు కేవలం 37 ఏళ్లు మాత్రమే. ఆదివాసీ ఉద్యమ నేతగా తెరపైకి వచ్చిన బొజ్జును రేవంత్‌రెడ్డి గుర్తించారు. పార్టీలో చేరగానే పీసీసీ ప్రధాన కార్యదర్శిని చేశారు. ఆదివాసీ పేద కుటుంబానికి చెందిన బొజ్జు కేవలం పార్టీని నమ్ముకుని ప్రజల్లోకి వెళ్లాడు. తొలిసారే 4,702 ఓట్ల తేడాతో గెలుపొంది, పిన్న వయసులోనే ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు. రేవంత్‌రెడ్డికి దగ్గరివాడు కావడంతో బొజ్జుకు మంచి గుర్తింపు ఉండే అవకాశం ఉంది. ఇక బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దోస్తుగా రాజకీయాల్లోకి వచ్చిన భూక్య జాన్సన్‌నాయక్ తొలిసారి ఖానాపూర్ నుంచి బరిలో దిగారు. తన శాయశక్తులా ప్రయత్నించినా గట్టిపోటీలో ఓటమి పాలయ్యారు. నాన్‌లోకల్‌తోపాటు పలు అంశాలు, ప్రభుత్వ వ్యతిరేకత ఆయనకు గెలుపును దూరం చేశాయి.

# పోస్టల్ బ్యాలెట్‌లోనూ నోటాకు ఓటు

- రెండు నియోజకవర్గాల్లో 19 ఓట్లు

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఉద్యోగులు, సర్వీస్ ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌లోనూ నోటాకు ఓట్లు పోలయ్యాయి. ఆదివారం వెల్లడించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విద్యావంతులు సైతం ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను కాదని నోటాకు ఓటేశారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 3073 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ఇందులోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ స్పష్టమైన ఆధిక్యతను కనబర్చారు. ఆయనకు 1140 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్నకు 595 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాస రెడ్డికి 961 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రెండో స్థానంలో నిలువడం గమనార్హం. కాగా నోటాకు 10మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. బోథ్ నియోజకవర్గంలో మొత్తం 1700 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవ్వగా బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావుకు అత్యధికంగా 718 ఓట్లు వచ్చాయి. ఎమ్మెల్యేగా గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌కు 495 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి అడే గజేందర్‌కు 371 ఓట్లు పోలయ్యాయి. తొమ్మిది మంది నోటాకు ఓటేయడం గమనార్హం.

### నిరాశతో బయటకి..



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్న 14వ రౌండ్ వరకు కౌంటింగ్ కేంద్రంలో కూర్చున్నారు. ఫలితాలు బీఆర్‌ఎస్‌కు ఆశాజనకంగా లేకపోవడంతో ఆయన అక్కడి నుంచి వెనుదిరిగాడు.

# బీఆర్‌ఎస్‌కు ఇక సమాధే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

- నా భర్త ఓడినా నాకు బాధ లేదు
- నా కలకల తగిలింది
- ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా
- ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: ఖానాపూర్‌లో వెడ్మ బొజ్జును గెలిపించి, నియోజవర్గ ప్రజలు కేసీఆర్‌కు బుద్ది చెప్పారని ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదివారం కడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్నారు. తన భర్త శ్యాం నాయక్ ఓడినా తనకు బాధ లేదని, ఖానాపూర్ గడ్డ కాంగ్రెస్ అడ్డా అని, ఇక నుంచి బీఆర్‌ఎస్ పార్టీని సమాధి చేయడమేనన్నారు. నీ పింఛన్, దళితబంధు, బీసీబంధు ఏటు పోయింది, ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఎందుకు గెలిపించాలేదు తెలుసుకో.. నా కలల తగిలిందని, కాంగ్రెస్‌ను గెలిపించిన ఖానాపూర్ నియోజవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

### బీజేపీ ఎంపీ 'సోయం' ఓటమి



సోయం బాపురావు

సాక్షి, ఆదిలాబాద్: శాసన సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ఓటమి పాలయ్యారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఆదిలాబాద్, నిర్మల్, సిర్పూర్, ము ధోల్‌లో బీజేపీ ప్రభంజనం కొనసాగగా ఇదే పార్లమెంట్ పరిధిలోకి వచ్చే బోథ్‌లో మాత్రం ఆయన ఓటమి చెందడాన్ని పార్టీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. అయితే ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ గెలుపొందారు.

### దీక్ష ఫలించింది... పదవి వరించింది





ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి శంకర్ విజయం సాధించాడు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని, దీక్ష తీసుకుని, రాజశ్యామల యాగం చేశాడు. యాగం చేసినప్పటి నుంచి చేతికి కంకణాలు కట్టుకొని, పాదరక్షలు లేకుండా ఆయన నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారాన్ని నిర్వహించాడు. ఎన్నికల్లో విజయం సాధించడంతో దీక్ష ఫలించి పదవి వరించినట్లయింది. అదేవిధంగా బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన అనిల్ జాదవ్ సైతం ఎమ్మెల్యే టికెట్ కేటాయించిన అనంతరం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల నుంచి చెప్పుల్లేకుండా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

# ఓడిన చోటే గెలుపును వెతుక్కున్నాడు..

- పట్టువీడని విక్రమార్కుడిలా 15 ఏళ్లుగా పోరాటం
- మూడు సార్లు ఓటమి.. నేడు మెజార్టీతో గెలిచిన అనిల్‌జాదవ్

బోథ్: బోథ్ నియోజకవర్గంలో గతంలో మూడుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన అనిల్ జాదవ్ ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందారు. మూడు సార్లు ఓడినా పట్టు విడువని విక్రమార్కుడిలా ఓడిన చోటే గెలుపును వెతుక్కున్నాడు. అనుహ్యంగా ఈసారి బీఆర్‌ఎస్ టికెట్ పొందిన అనిల్ జాదవ్ మొదటి నుంచి నియోజకవర్గంలో పకడ్బందీగా ప్రచారం నిర్వహించారు. మొదటి నుంచి కార్యకర్తలు, నాయకులను సమన్వ యం చేసుకుంటూ గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించాడు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించడంలో సక్సెస్ అయ్యారు. తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్‌పై 22వేల 800 మెజారిటీతో గెలుపొందాడు. దీంతో ఆయన సంతోషానికి హద్దులు లేకుండా పోయాయి. గతంలో 2009, 2014, 2018లో ఆయన పోటీ చేశారు. 2009, 2014లో కాంగ్రెస్ నుండి పోటీ చేయగా, 2018లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశాడు. మూడు ఎన్నికల్లో అటుఇటుగా 30వేల ఓట్లు తెచ్చుకున్నాడు. 15ఏళ్లుగా గెలుపు కోసం ఎదురుచూస్తున్నాడు. దీంతో ఆయన బీఆర్‌ఎస్ దృష్టిలో పడడంతో బోథ్ టికెట్ ఆయనకు కేటాయించింది. ఆయనకున్న ఓటు బ్యాంకుతో పాటు బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకుతో సులువుగా గెలుపొందారు. ఈ సారి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి 76792 ఓట్లు తెచ్చుకున్నాడు. మూడు సార్లు ఓడిన సానుభూతి కూడా ఆయనకు కలిసివచ్చింది. తన సామాజిక వర్గానికి చెందిన లంబడా ఓట్లు కూ డా ఎక్కువ మొత్తంలో చీలిపోకపోవడంతో ఆయన ప్రతి బూత్‌లో ఆధిక్యం కనబర్చాడు. దీంతో ఈసారి విజయం సాధించాడు. 15 ఏళ్ల కల నేటితో సాకారం కావడంతో విజయ ఆనందంలో ఉన్నారు.

# సొంత గ్రామాల్లో ఆధిక్యం..

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గంలో వివిధ పార్టీల అభ్యర్థుల సొంత గ్రామాల్లో వారికి ఎక్కువ మొత్తంలో ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ సొంత గ్రామం నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామంలో మొత్తం 957 ఓట్లు ఉండగా 832 ఓట్లు పోలయ్యాయి. అనిల్ జాదవ్‌కు 778 ఓట్లు పడ్డాయి. ఇక్కడ బీజేపీ అభ్యర్థికి 20, కాంగ్రెస్ అభ్యర్థికి 30 ఓట్లు పడ్డాయి. 4 ఓట్లు ఇతరులకు పడ్డాయి. బీజేపీ అభ్యర్థి సొంత గ్రామమైన నాగుగూడ గ్రామస్తులకు ఘన్‌పూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లో అదివాసీలతో పాటు లంబడా వర్గానికి చెందిన ఓటర్లు ఉన్నారు. ఈ పోలింగ్ బూత్‌లో మొత్తం 856 ఓటర్లు ఉండగా, 687 ఓట్ల పోలయ్యాయి. ఇందులో బీజేపీ అభ్యర్థి సోయం బాపూరావ్‌కు 231 ఓట్లు పడ్డాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థికి 270, కాంగ్రెస్ అభ్యర్థికి 156 పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి ఆడె గజేందర్ స్వగ్రామమైన బొందిడిలో మొత్తం 818 ఓట్లు ఉండగా 694 ఓట్లు పోలయ్యాయి. ఇందులో ఆడె గజేందర్‌కు 434 ఓట్లు , బీఆర్‌ఎస్ అభ్యర్థికి 113, బీజేపీ అభ్యర్థికి 113ఓట్లు పోలయ్యాయి.

**ఆదిలాబాద్ నియోజకవర్గంలోని అభ్యర్థులకు..**

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గం ఎన్ని కల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ పోలింగ్ కేంద్రాల్లో అత్యధికంగా ఓట్లు సాధించారు. బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌కు సంబంధించిన శాంతినగర్‌లోని 281వ పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి 242 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్నకు 294, బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌కు అత్యధికంగా 301 ఓట్లు పోలయ్యాయి. అలాగే బీఆర్‌ఎస్ అభ్యర్థి జోగు రామన్న సొంత గ్రామమైన జైనథ్ మండలం దీపాయిగూడలో అత్యధికంగా 290 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డికి 201, బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌కు 120ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి ఓటేసిన ఆదిలాబాద్ పట్టణంలోని కోలాం ఆశ్రమ పాఠశాలలోని 177వ పోలింగ్ కేంద్రంలో కంది శ్రీనివాసరెడ్డికి 149 ఓట్లు రాగా, జోగు రామన్నకు 197 ఓట్లు అత్యధికంగా బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్‌కు 273 ఓట్లు పోలయ్యాయి.

### 37ఏళ్ల అపూర్వ కలయిక



కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాలలో 1986-87 పదో తరగతి చెందిన పూర్వ విద్యార్థులు 37ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. కుంటాల శ్రీగజ్జలమ్మ దేవి ఆలయం వేదికగా ఒకే చోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని పిల్లాపాపలతో రోజంతా సరదాగా గడిపారు. ఇకనుంచి కష్టసుఖాల్లో తోడుంటామని నిర్ణయించుకున్నారు.